క్లుప్తంగా

నేడు ఎమ్మెల్యే, ఎమ్మెల్సీల పర్యటన

మారేడుమిల్లి: రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి, ఎమ్మెల్సీ అనంతబాబు గురువారం మండలంలో జరిగే పలు అభివృద్ధి కార్యక్రమంలో పాల్గొంటారని, పార్టీ మండల కన్వీనర్ సత్తి సత్యనారాయణ రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో భాగంగా మధ్యాహ్నం 12 గంటలకు వనవిహారి వద్ద ఏర్పాటు చేసిన బెంబో రెస్టారెంట్‌ను ప్రారంభిస్తారని, 2 గంటలకు మర్రివాడు నుంచి ఎల్లివాడ రోడ్డు నిర్మాణానికి ఎల్లివాడలో శంకుస్థాపన చేస్తారని పేర్కొన్నారు. కార్యక్రమానికి అధికారులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు హాజరుకావాలని కోరారు.

నేడు సచివాలయాలు ప్రారంభం

చింతపల్లిరూరల్: లంబసింగి, కొత్తపాలెం 1,2 లో నిర్మించిన నూతన సచివాలయ భవనాలను గురువారం ప్రారంభించనున్నట్టు ఎంపీడీవో ఆశాజ్యోతి బుధవారం తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాడేరు ఎమ్మెల్యే కొట్టగుల్లి భాగ్యలక్ష్మి హాజరుకానునట్టు పేర్కొన్నారు. పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు, మండల స్థాయి అధికారులు హాజరుకావాలని కోరారు.

కుటుంబ సంక్షేమ శస్త్రచికిత్సలపై అవగాహన

అడ్డతీగల: కుటుంబ సంక్షేమ శస్త్ర చికిత్సలపై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని దుప్పులపాలెం పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ స్పందన అన్నారు. శస్త్ర చికిత్సల పక్షోత్సవాల్లో భాగంగా కుటుంబ నియంత్రణపై బుధవారం దుప్పులపాలెంలో వైద్య సిబ్బందితో కలిసి అవగాహన ర్యాలీ నిర్వహించారు. కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ పోశమ్మ, మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ రామకృష్ణ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

రాజవొమ్మంగి: మండల కేంద్రంలో వైద్యాధికారులు డాక్టర్ సుష్మా, డాక్టర్ ఉషశ్రీ, సబ్ యూనిట్ ఆఫీసర్ ప్రసాద్ ఆధ్వర్యంలో వేసక్టమీ ఆపరేషన్‌పై వైద్య సిబ్బంది అవగాహన ర్యాలీ నిర్వహించారు.

దోమల నివారణకు చర్యలు

వై.రామవరం: చవిటిదిబ్బలు పీహెచ్‌సీ వైద్యాధికారులు డాక్టర్ దినేష్, నరేంద్రల ఆధ్వర్యంలో పూతిగుంట, పనసలపాలెం, దాలిపాడు, ఊలెంపాడు, రేగడిపాలెం, కె.యర్రగొండ గ్రామాల్లో చెరువులు, నీటి గుంతల్లో దోమల నివారణ మందును వేశారు. వారు మాట్లాడుతూ దోమల నివారణకు చర్యలు తీసుకుంటున్నామన్నారు.ఎంపీటీసీ సభ్యుడు కృష్ణారెడ్డి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు అభినందనలు

రాజవొమ్మంగి: మండల కేంద్రంలోని అల్లూరి సీతారామరాజు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు ఇటీవల జేఎన్‌టీయూ కాకినాడలో జరిగిన రాష్ట్రస్థాయి ఆటల పోటీలతో పాటు కోలాటం ప్రదర్శనలో ప్రతిభ చాటారని ప్రిన్సిపాల్ గోపాలకృష్ణ చెప్పారు. ఈ సందర్భంగా పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో వారిని అభినందించారు.

ఇంటింటికీ కుళాయి

గూడెంకొత్తవీధి: మండల కేంద్రంలోని బొడ్డమానుపాకలులో నిర్మించిన తాగునీటి కుళాయిలను ఎంపీటీసీ సభ్యురాలు నాగమణి, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బొబ్బిలి లక్ష్మణ్ బుధవారం ప్రారంభించారు. ప్రభుత్వం తాగునీటి సమస్యను పరిష్కరించి, ఇంటింటికీ కుళాయి అందజేయనున్నట్టు చెప్పారు. నేతలు పాల్గొన్నారు.

చదువుతో పాటు క్రీడల్లో రాణించాలి

రాజవొమ్మంగి: లాగరాయి జెడ్పీ పాఠశాలను సీఐ బాజీలాల్, సర్పంచ్ గణలక్ష్మి బుధవారం సందర్శించారు. వారు మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలన్నారు. వ్యవసాయ కమిటీ చైర్మన్ వెంకటరమణ, బాలకృష్ణ, హెచ్‌ఎం దేవుడు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ బీమా అందజేత

జి.మాడుగుల: మండలంలో సింగర్భ పంచాయతీ కర్నికలంక గ్రామానికి చెందిన పాంగి బెన్నలింగం బుధవారం అనారోగ్యంతో మృతి చెందారు. ఈ నేపథ్యంలో బాధిత కుటుంబానికి ప్రభుత్వం ద్వారా మంజూరు అయిన వైఎస్సార్ బీమా పథకం కింద రూ.10,000నగదును వైఎస్సార్‌సీపీ జిల్లా ఎగ్జిక్యూటివ్ మెంబర్ పాంగి రామకృష్ణ, వలింటీర్లు రవణమ్మ , కృష్ణ అందజేశారు. వారు మాట్లాడుతూ వైఎస్సార్ బీమా బాధిత కుటుంబాలకు ఆసరాగా నిలుస్తోందన్నారు. కార్యక్రమంలో గృహసారధులు, గ్రామ పెద్దలు తదితరలు పాల్గొన్నారు.

సర్కారు బడి.. సరికొత్త ఒరవడి



గతంలో కనీస వసతులు కరువై రూపురేఖలు కోల్పోయిన ప్రభుత్వ పాఠశాలలకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి జవసత్వాలు కల్పించారు. నాడు–నేడు కార్యక్రమం ద్వారా సర్కారు బడుల అభివృద్ధి కోసం కోట్లాది రూపాయలు నిధులు విడుదల చేశారు. కార్పొరేట్‌కు దీటుగా సర్కారు పాఠశాలల్లో సకల సౌకర్యాలతో ఆహ్లాదకర వాతావరణంలో విద్యార్థులను ఆకట్టుకునేలా తరగతి గదులు రూపుదిద్దుకున్నాయి. మెరుగైన విద్య, సకల సదుపాయాలున్న పాఠశాలల్లో పిల్లలను చేర్పించేందుకు తల్లిదండ్రులు ఉత్సాహంతో ముందుకొస్తున్నారు. రాష్ట్రంలో పాఠశాలల అభివృద్ధి దేశానికే తలమానికం నిలిచింది.

- నాడు–నేడుతో పాఠశాలల్లో కొత్త మెరుపులు
- పెరుగుతున్న విద్యార్థుల సంఖ్య


పెదగరువు పాఠశాల


సుందరంగా తీర్చిదిద్దిన అల్లంపుట్టు పాఠశాల

హుకుంపేట: మండలంలోని ప్రభుత్వ పాఠశాలలకు మహర్దశ చేకూరింది. గత టీడీపీ హయాంలో సర్కారు బడులు కనీస అభివృద్ధికి నోచుకోలేదు. ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలకే ప్రాధాన్యమిచ్చింది. ప్రభుత్వ పాఠశాలలు శిథిల భవనాల్లో, పైకప్పు లేని గదుల్లో , అధ్వాన పరిస్థితుల్లో కొనసాగాయి. అదంతా గతం.. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా అధికారం చేపట్టాక ప్రభుత్వ పాఠశాలల దిశ, దశ మార్చేశారు. నాడు–నేడు ద్వారా సర్కారు బడులకు జీవం పోశారు. కార్పొరేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో సకల సదుపాయాలు, బోధనకు కోట్లాది రూపాయలు వెచ్చించింది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రెండు విడతల్లో మంజూరు చేసిన నిధులతో పాఠశాలల రూపురేఖలు మారాయి. గణనీయంగా విద్యార్థుల సంఖ్య పెరుగుతోంది. ఇది కదా అభివృద్ధి అని విద్యార్థుల తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తున్నారు.


అల్లంపుట్టు పాఠశాలలో ఆట వస్తువులు

- పెదగరువు పాఠశాలలో రూ.58లక్షలతో డిజిటల్ బోధన, తరగతి గదులు, మరుగుదొడ్లు తదితర పనులు చేశారు.
- అల్లంపుట్టులో రూ.42లక్షలతో టాయిలెట్స్, తరగతి గదుల నిర్మాణ పనులు చేశారు.
- బూరువీధిలో ఎంపీపీ పాఠశాలలో రూ.25లక్షలతో మరుగుదొడ్లు, విద్యుత్, తరగతి గదుల పనులు చేశారు.
- మారుమూల శివారు గ్రామమైన ఓలుబిడ్డ ప్రాథమిక పాఠశాలలో రూ.15లక్షలతో అదనపు తరగతి గది తదితర పనులు చేపట్టారు.
- బాకూరులో రూ.42లక్షలతో మరుగుదొడ్లు, విద్యుత్ పనులు చేపట్టారు.

నిధుల మంజూరు..అభివృద్ధి

హుకుంపేట మండల వ్యాప్తంగా మొదటి విడత నాడు– నేడు ద్వారా 39 పాఠశాలలు అభివృద్ధి పనులు చేశారు. రెండవ విడత 48పాఠశాలల్లో ప్రస్తుతం పనులు జరుగుతున్నాయి. మొత్తం 87 పాఠశాలల్లో అభివృద్ధి జరిగింది. పలు పాఠశాలల్లో డిజిటల్ తరగతి గదులు, మరుగుదొడ్లు, ప్రహరీలు, అదనపు గదుల నిర్మాణ పనులు, ఆధునిక సదుపాయాలతో దర్శనమిస్తున్నాయి. పాఠశాలల్లో మెరుగైన బోధనతో విద్యార్థుల సంఖ్య గణనీయంగా పెరిగినట్టు అధికారులు చెబుతున్నారు. సర్కారు పాఠశాలల్లో అభివృద్ధితో విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

మండలం:	హుకుంపేట
పంచాయతీలు:	66
గ్రామాలు:	168
జనాభా:	56,189
ప్రాథమిక పాఠశాలలు:	197
హైస్కూళ్లు:	15
కేజీబీవీ:	1
నాడు–నేడు మొదటి విడతలో నిధులు:	రూ.10.53 కోట్లు
ఎంపికైన పాఠశాలల సంఖ్య:	39
నాడు–నేడు రెండవ విడతలో నిధులు	15.37 కోట్లు
ఎంపికైన పాఠశాలల సంఖ్య:	48

సదుపాయాలు బాగున్నాయి



గతంలో తరగతి గదులు బాగోలేక, బెంచిలు లేక నేలపై కూర్చొని విద్యభ్యసించాము. నేడు పాఠశాలలో చదువుకోవడానికి డిజిటల్ బోధన, ఆధునిక సదుపాయాలతో మరుగుదొడ్లు, తరగతి గదులు దర్శనమిస్తున్నాయి. ప్రశాంత వాతావరణంలో విద్య అభ్యసిస్తున్నాం. నాడు–నేడు ద్వారా మాకు, పాఠశాలలకు మంచిరోజులు వచ్చాయి.

– పాంగి సంజన సౌమ్య, 9వ తరగతి, పెదగరువు పాఠశాల

జగనన్నకు రుణపడి ఉంటాం



ఎన్నడూ ఊహించని విధంగా ప్రభుత్వ పాఠశాలల్లో అభివృద్ధి పనులు జరిగాయి. ఆధునిక సదుపాయాలు, మెరుగైన బోధనతో పాటు బడులు రూపురేఖలు మారాయి. జగనన్న అందిస్తున్న అమ్మఒడి ఇతర పథకాలతో మాలాంటి కుటుంబాల తలరాతలు మారాయి. జగనన్నకు రుణపడి ఉంటాం.

– కిముడు లక్ష్మి, గరుడపల్లి గ్రామం, హుకుంపేట మండలం

డ్రాపౌట్స్ తగ్గాయి



ప్రభుత్వం నాడు–నేడు ద్వారా చేపట్టిన అభివృద్ధితో పాఠశాల రూపు రేఖలు మారాయి. మెరుగైన బోధన, ఆధునిక సదుపాయాల కల్పనతో తల్లిదండ్రులు తమ పిల్లలను మా పాఠశాలలో చేర్పిస్తున్నారు. విద్యార్థులు సంఖ్య పెరుగుతుంది. డ్రాపౌట్స్ గణనీయంగా తగ్గాయి. – వి.కొండమ్మ, హెచ్‌ఎం, పెదగరువు బాలికల పాఠశాల, హుకుంపేట


పెదగరువు పాఠశాలలో డిజిటల్ బోధన


అల్లంపుట్టు పాఠశాల ముఖద్వారం


పెదగరువు పాఠశాలలో మరుగుదొడ్లు

ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ

జి.మాడుగుల: మండలంలో కిల్లంకోట పంచాయతీ కోడిమామిడి గ్రామంలో బుధవారం లయన్స్ క్లబ్ స్టీల్ సిటీ, యూత్ హాస్టల్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా, దువ్వాడ కుసుమహరనాథ్ సంయుక్తంగా ఉచిత వైద్య శిబిరాన్ని, వస్త్ర వితరణ కార్యక్రమాలు నిర్వహించాయి. డాక్టర్ సూర్యప్రభ మాట్లాడుతూ ఆరోగ్యంపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. శిబిరంలో వచ్చిన వారికి వైద్య పరీక్షలు చేసి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. శిబిరానికి వచ్చిన రోగులకు గాజువాక లయన్స్ క్లబ్ రూ.10,000విలువ గల మందులు వితరణ చేసింది. మహిళలకు చీరలు, పురుషులకు, పిల్లలకు దుస్తులు అందజేశారు. పాడేరు గ్రామీణ నీటి సరఫరా విభాగం ఆధ్వర్యంలో దుప్పట్లు పంపిణీ చేశారు. లయన్స్ క్లబ్ ప్రతినిధి ఎం.ఎస్.ఎన్. మూర్తి, యూత్ హాస్టల్స్ చైర్‌పర్సన్ ఎ.దీప్తి, కార్యదర్శులు పి.కె.ఎం.లక్ష్మి, వై.కె.గార్గ్, సత్యప్రకాష్, విజయ్‌కుమార్, సంఘాల ప్రతినిధులు రమామని, హేమ, వాణిశ్రీ,, సర్పంచ్‌లు ముత్యాలమ్మ, మాలన్న, ఎంపీటీసీ సభ్యుడు ఎల్.అప్పలరాజు, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈఈ ప్రకాష్, ఏఈ విజయ్‌కుమార్, ఎస్.రాము తదితరలు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో మౌలిక వసతులు

అడ్డతీగల: అడ్డతీగల ప్రాజెక్ట్ పరిధిలోని పాఠశాలల హెచ్‌ఎంలు, ఐసీడీఎస్ సిబ్బంది, ఇంజినీరింగ్ అసిస్టెంట్‌లు, కమిటీలోని సభ్యులతో ఇన్‌చార్జ్ సీడీపీవో వై.సుధ బుధవారం సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నాడు–నేడు పథకం ద్వారా అంగన్‌వాడీ కేంద్రాల్లో మౌలిక వసతులు కల్పించనున్నట్టు తెలిపారు. అడ్డతీగల, వై.రామవరం లోయర్‌పార్ట్ మండలాల్లోని 80 అంగన్‌వాడీ కేంద్రాల్లో నాడు–నేడు పథకంలో ఎంపికయ్యాయన్నారు. ఆయా అంగన్‌వాడీ కేంద్రాల్లో మరుగుదొడ్లు, తాగునీరు, ఎలక్ట్రిఫికేషన్, పెయింటింగ్ తదితరు పనులు మౌలిక సదుపాయాలు కల్పించనున్నట్టు తెలిపారు. పనుల్లో నాణ్యత ఉండేలా చూడాలని సూచించారు.అడ్డతీగల, వై.రామవరం ఎంఈవోలు శ్రీనివాసరావు, తాతబ్బాయిదొర తదితరులు పాల్గొన్నారు.

రాజవొమ్మంగి: మండల కేంద్రంలో సీడీపీఓ దేవమణి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో నాడు–నేడు ద్వారా చేపట్టనున్న పనులను ఎంపీడీవో యాదగిరీశ్వరరావు వివరించారు. ఇంజినీర్లు, ఐసీడీఎస్ సిబ్బంది, గిరిజనసంక్షేమశాఖ ఏఈ వీరభద్రరావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గౌరీ పరమేశ్వరుల ఉత్సవాలు

సాక్షి,పాడేరు: పట్టణంలోని గౌరి పరమేశ్వరుల నెల రోజుల ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి.గౌరీ పరమేశ్వరులకు పూజ చేసిన పసుపు, కుంకుమ, తాంబులాల పంపిణీ కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. పట్టణ పరిధిలోని అన్ని వర్గాల మహిళలు ఉత్సవ మండపానికి చేరుకుని కమిటీ సభ్యులు, అర్చకులు అందజేసిన పసుపు, కుంకుమలను స్వీకరించారు. సర్పంచ్ కొట్టగుల్లి ఉషారాణి, ఉత్సవ కమిటీ అధ్యక్షుడు పరమేశ్వరరావు, సతీష్, మోహన్, కొండబాబు, రామకృష్ణ పాల్గొన్నారు. గౌరీ పరమేశ్వరుల ఉత్సవాలకు సంబంధించి డిశంబర్ 2వ తేదీన సారె ఊరేగింపు, 6న భారీ అన్నసమారాధన నిర్వహించునున్నట్టు ఉత్సవ కమిటీ అధ్యక్షుడు పరమేశ్వరరావు తెలిపారు.


పసుపు, కుంకుమ పంపిణీ చేస్తున్న గౌరిసేవాసంఘం ప్రతినిధులు

మాంసం దుకాణాల్లో తనిఖీలు

అనంతగిరి: మండలంలోని కాశీపట్నం వారపు సంతల్లో మాంసం దుకాణాలను పశువైద్యాధికారి డాక్టర్ గణేశ్వరరావు బుధవారం తనిఖీలుచేశారు. ఆయన మాట్లాడుతూ మాంసం విక్రయాలకు సంబంధిత పంచాయతీ అధికారుల అనుమతులు తీసుకోవాలని యజమానులకు సూచించారు. జబ్బుపడిన, నాణ్యత లేని మేకలు, గొర్రెలు, కోళ్ల అమ్మకాలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పలువుర వ్యాపారులకు సూచనలిచ్చారు. నాసిరకం, కల్తీ వస్తువులు విక్రయించొద్దని సూచించారు. పినకోట పశువైద్య ఉపకేంద్రం జూనియర్ వెటర్నరీ అధికారి సుధావనీ తదితరులు పాల్గొన్నారు.

యూటీఎఫ్ సాయం

అడ్డతీగల: స్థానిక ఎంఆర్‌సీ వద్ద విద్యా వనరుల సిబ్బంది కంప్యూటర్ ఆపరేటర్ బుల్లిదొర, సీఆర్పీలు రవి, వాసు, రమణ, మెసెంజర్ ఈశ్వరరావు తదితరులకు నిత్యావసర సరకులను ఏజెన్సీ డీఈవో వై.మల్లేశ్వరరావు, యూటీఎఫ్ నేతలు శ్రీనివాస్, రాఘువులు, జిల్లా ఆడిట్ సభ్యుడు రాంబాబు తదితరులు అందజేశారు. నాయకులు పాల్గొన్నారు.

ఓటు హక్కుపై అవగాహన

చింతపల్లిరూరల్: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు ఓటు హక్కుపై డిప్యూటీ తహసీల్దార్ రాజ్‌కుమార్ బుధవారం అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ అర్హులందరికీ ఓటరుగా నమోదు చేసుకోవాలన్నారు. ప్రిన్సిపాల్ ఎం.శ్రీనివాస్‌పాత్రుడు, వైస్ ప్రిన్సిపాల్ వి.రమణ తదితరులు పాల్గొన్నారు.

డాక్టర్ సత్యనారాయణకు నివాళి

చింతపల్లిరూరల్: మండలంలో లోతుగెడ్డ పీహెచ్‌సీ పూర్వ వైద్యుడు డాక్టర్ లక్ష్మీకాంత్ సత్యనారాయణ వర్ధంతిని పురస్కరించుకొని ఆయన విగ్రహానికి డాక్టర్ జానకి తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన చేసిన సేవలను పలువురు కొనియాడారు.

సంఘం బలోపేతానికి కృషి

మారేడుమిల్లి: కమ్యూనిటీ పారా మెడికల్స్ అండ్ ప్రైమరీ హెల్త్ కేర్ ప్రొవైడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సర్వసభ్య సమావేశం జిల్లా కన్వీనర్ కె.జగదీశ్ అధ్యక్షతన బుధవారం జరిగింది. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షుడు తోరాటి ప్రభాకర్‌రావు మాట్లాడుతూ సంఘం బలోపేతానికి సభ్యులు కృషి చేయాలన్నారు. ప్రాథమిక వైద్యులు తమ పరిధిలోని వైద్య సేవలను ప్రజలకు అందిచాలని, ప్రభుత్వం నిర్వహించే ఎయిడ్స్, మలేరియా, క్షయ వంటి వ్యాధులపై కలిగించే అవగాహన కార్యక్రమాల్లో పాల్గొవాలని పిలుపు నిచ్చారు. రాజు, రాంబాబు, శ్రీనివాసరావు, దేవానందం, చిన్ని తదితరులు పాల్గొన్నారు.

సీఎం జగన్‌తోనే అభివృద్ధి


పాడేరులో సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరిస్తున్న నాయకులు


ఏబులంలో పార్టీ జెండాను ఆవిష్కరిస్తున్న నేతలు


కొయ్యూరులో పార్టీ జెండాను ఆవిష్కరిస్తున్న ఎంపీపీ రమేష్, నేతలు


గౌరిదేవిపేటలో పథకాల బోర్డును ప్రారంభిస్తున్న నాయకులు


తాడేపల్లిలో బుక్‌లెట్‌లను పంపిణీ చేస్తున్న కన్వీనర్ సత్యనారాయణరెడ్డి


కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు


కోటలో సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరిస్తున్న నేతలు


పెదమట్టపల్లిలో పథకాల బోర్డును ఆవిష్కరిస్తున్న నాయకులు ,ప్రజాప్రతినిధులు

పాడేరు రూరల్: జిల్లా వ్యాప్తంగా వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో జరుగుతున్న ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమానికి విశేష స్పందన వస్తోంది. ఈ సందర్భంగా నాయకులు పార్టీ జెండాను, సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరించారు. పలువురు మాట్లాడుతూ రాష్ట్రంలో అభివృద్ధి, ప్రజా సంక్షేమం ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డితోనే సాధ్యమన్నారు. పారదర్శకంగా పథకాలను అందిస్తున్నారన్నారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీకి మద్దతు తెలిపి జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిగా గెలిపించాలని కోరారు. పాడేరులో జరిగిన కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు రాంబాబు, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి మంగ్లన్నదొర, వైస్ ఎంపీపీ కనకాలమ్మ, సర్పంచ్‌లు రాంబాబు సన్నిబాబు, ఏఎంసీ డైరెక్టర్ సత్యవతి తదితరులు పాల్గొన్నారు.

గూడెంకొత్తవీధి: రింతాడలో జరిగిన కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు, సర్పంచ్, నాయకులు పాల్గొన్నారు.

కొయ్యూరులో.. ఎంపీపీ బడుగు రమేష్, మండల పార్టీ అధ్యక్షుడు జె.బాబులు, కన్వీనర్ సుధాకర్, పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి సూరిబాబు, వైస్ సర్పంచ్ వనంబాబు తదితరులు పాల్గొన్నారు.

రంపచోడవరంలో.. సర్పంచ్ ఎం.బొజ్జయ్య, ఎంపీపీ బందం శ్రీదేవి, జెడ్పీటీసీ సభ్యురాలు వెంకటలక్ష్మి, వైస్ ఎంపీపీ పి.కుమారి, ఎంపీటీసీ సభ్యులు వెంకటేశ్వర్లు, లక్ష్మీ, కన్వీనర్ రామకృష్ణ, నాయకులు రూతూ, సింహాద్రి, లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

మారేడుమిల్లి: కుండాడ, తాడేపల్లి గ్రామాల్లో జరిగిన కార్యక్రమాల్లో పార్టీ మండల కన్వీనర్ సత్తి సత్యనారాయణరెడ్డి, ఎంపీపీ సార్ల లలితకుమారి, కో–ఆప్షన్ సభ్యుడు ధర్మరాజు, కన్వీనర్ బాబీ, ఏఎంసీ డైరెక్టర్ స్మిత్ సర్పంచ్ ప్రభాకర్‌రెడ్డి , లక్ష్మీ, వైస్ సర్పంచ్ వీరబాబు, నాయకులు సోమిరెడ్డి, రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వై.రామవరం: కోట గ్రామంలో జరిగిన కార్యక్రమంలో ఎంపీపీ ఆనందరావు, జెడ్పీటీసీ సభ్యురాలు వెంకటలక్ష్మి, వైస్ ఎంపీపీలు జోగిరెడ్డి, విశ్వమ్మ, కన్వీనర్ అప్పారావు, ఎంపీటీసీ సభ్యురాలు సుబ్బలక్ష్మి, సర్పంచ్ చిన్నారావు, నాయకులు కనకరాజు, తిరుపతిరెడ్డి, భారతిబాబు, సుజానమ్మ తదితరులు పాల్గొన్నారు.

వీఆర్‌పురం: పెదమట్టపల్లిలో జరిగిన కార్యక్రమంలో కన్వీనర్ సత్తిబాబు, జేసీఎస్ ఇన్‌చార్జి సత్యనారాయణ, సర్పంచ్ లక్ష్మీ, ఎంపీటీసీ సభ్యుడు ప్రదీప్, నాయకులు బాబు, మురళీ, రాజు, నాగేశ్వరరావు, కాంతారావు, రాజేశ్వరి, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎటపాక: గౌరీదేవిపేటలో జరిగిన కార్యకమంలో సర్పంచ్ రాములమ్మ, సొసైటీ మాజీ అధ్యక్షుడు వెంకట రామారావు, నేతలు రాజేష్, నవీన్, రమేష్, వెంకటేశ్వరరావు, శేఖర్, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

'ఆడుదాం ఆంధ్రా' నిర్వహణపై రేపు సమావేశం

కొయ్యూరు: ఆడుదాం ఆంధ్రాపై పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ ఇంజినీరింగ్ సహాయకులతో శుక్రవారం సమావేశం నిర్వహించనున్నట్టు ఎంపీడీవో లాలం సీతయ్య బుధవారం తెలిపారు.15 సంవత్సరాలు దాటిన స్త్రీ, పురుషులు ఆడుదాం ఆంధ్రాలో పాల్గొనేందుకు వీలుగా చేపట్టాల్సిన చర్యలను చర్చిస్తామన్నారు. క్రీడల్లో పాల్గొనే వారి పేర్లను సచివాలయాలు లేదా 1902 టోల్‌ఫ్రీ నంబర్‌లో తెలియజేయవచ్చన్నారు. ఆడుదాం ఆంధ్రా యాప్‌లోను డిసెంబర్ 13లోగా నమోదు చేసుకోవాలని కోరారు. డిసెంబర్ 15 నుంచి పోటీలు ప్రారంభమవుతాయన్నారు. పోటీలో నగదు బహుమతులు రూ.20వేల నుంచి రూ.5లక్షల వరకు ఉంటుందన్నారు. క్రీడాకారులు పోటీల్లో పాల్గొనేందుకు పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు. వైద్యులు, సిబ్బందితో శుక్రవారం సమావేశం నిర్వహిస్తామని ఎంపీడీవో లాలం సీతయ్య చెప్పారు.

తుపానుపై అప్రమత్తం

హుకుంపేట: బంగాళఖాతంలో ఏర్పడనున్న తుపాను ప్రభావంతో ఏజెన్సీలో వర్షాలు పడే అవకాశాలు ఉందని వ్యవసాయ రైతులు అప్రమత్తంగా ఉండాలని ఎంపీపీ కూడా రాజుబాబు అన్నారు. ఆయన బుధవారం విలేకరులతో మాట్లాడుతు వరి కోతలు ప్రారంభమైన నేపధ్యంలో వర్షాలకు వరి పంట,సామలు,కందులు తదితర పంటలు తడిచిపోయి పంట నష్టం వాటిల్లే అవకాశం ఉందని గిరిజనులు ముందస్తుగా అప్రమత్తంగా ఉంటు వరి పనలు, కుప్పలు తడవకుండా జాగ్రత్త పడాలని ఆయన తెలిపారు.

సామాజిక న్యాయసభ పోస్టర్ ఆవిష్కరణ

రాజవొమ్మంగి: విజయవాడలో డిసెంబర్ 7న జరుగనున్న మాదిగల సామాజిక న్యాయ మహా సభను విజయవంతం చేయాలని మాదిగల జిల్లా అధ్యక్షుడు వేమగిరి ముసిలిబాబు కోరారు. మండలంలోని జడ్డంగిలో బుధవారం జరిగన కార్యక్రమంలో సభ గోడ పత్రికను ఆవిష్కరించారు. మహాసభకు ఇన్నార్మ్ ఇంటర్నేషనల్ అధ్యక్షులు గెడ్డం బాపిరాజు హాజరౌతున్నట్లు పేర్కొన్నారు. సభలో మాదిగల సమస్యలపై చర్చించనున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో బుజ్జిబాబు, కామరాజు, కిరణ్, నాగేశ్వరరావు, జీవ, ఏసు పాల్గొన్నారు.